ఆదివారం
11 -01- 2026
విజయనగరం : ప్రచురణ
సంపుటి : 02 సంచిక : 306
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by :
Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari,Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com
స్థాపితం : 2008
RNI No. APTEL/2008/24928
Postal Registration No. : VZM/22/2020-2022
Period of Renewal. : 01-01-2023 to 31-12-2025

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)



న్యూస్ పేపర్స్ యాజమాన్యానికి శుభవార్త

అతి తక్కువ ధరలకే బ్లాక్ అండ్ వైట్, మల్టీకలర్ దినపత్రికలు, వార పత్రికలు, పక్ష పత్రికలు మరియు మాస పత్రికలు ప్రింటింగ్ చేయబడును
ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కలదు
ఇట్లు
ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక ప్రింటింగ్ యూనిట్
Cell : 93470 64455


## సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా 10 ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, విజయవాడ మధ్య నడవనున్న సర్వీసులు

జనవరి 11 నుంచి 19 వరకు పలు తేదీల్లో రాకపోకలు

రిజర్వేషన్ లేని వారి కోసం అధికంగా జనరల్ బోగీలు

హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. పండగ కోసం సొంత ఊళ్లకు వెళ్లేవారి సౌకర్యార్థం హైదరాబాద్ – విజయవాడ మధ్య మొత్తం 10 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళు పండగకు ముందు, తర్వాత రోజుల్లో రాకపోకలు సాగించనున్నాయి. ఈ ప్రత్యేక రైళ్లలో ఛైర్ కార్ బోగీలతో పాటు జనరల్ బోగీలు కూడా ఉంటాయి. ముఖ్యంగా, రిజర్వేషన్ లేకుండా ప్రయాణించే మిగతా..2లో

## మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా విలువైన భూమికి హైడ్రా రక్షణ



మియాపూర్‌లో రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

సర్వే నంబర్ 44లో 15 ఎకరాలకు పైగా భూమిని కాపాడిన హైడ్రా

తప్పుడు పత్రాలతో కబ్జాకు యత్నించినట్లు అధికారుల నిర్ధారణ

ఆక్రమణల తొలగింపు.. భూమి చుట్టూ ఫెన్సింగ్, బోర్డుల ఏర్పాటు

హైదరాబాద్: కబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. శేరిలింగంపల్లి మండలం, మక్తా మహబూబ్‌పేటలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి కబ్జాకు గురవుతోందని గతంలోనే హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు అందాయి. మిగతా..2లో

## పనులు శరవేగంగా సాగుతున్నాయంటూ మంత్రి లోకేశ్ ట్వీట్



- శ్రీసిటీలో రూ.5,000 కోట్లతో ఎల్జీ భారీ ప్లాంట్ ఏర్పాటు
- భారత్‌లో ఎల్జీకి ఇది మూడో తయారీ యూనిట్
- 2026 చివరికల్లా ఉత్పత్తి ప్రారంభం, వేల మందికి ఉద్యోగాలు
- శ్రీసిటీ ఎల్జీ ప్లాంట్ లో ఫ్రిజ్ లు ఏసీలు, వాషింగ్ మెషీన్ల తయారీ

## నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి
# తేడా తెలియని వ్యక్తి జగన్

- ఇటీవల నదుల అనుసంధానం, రాయలసీమ ప్రాజెక్టులపై జగన్ విమర్శలు చేశారు.
- జగన్ చేస్తున్న విమర్శలకు సీఎం చంద్రబాబు నాగరికతను జోడిస్తూ కౌంటర్ ఇచ్చారు.


వివరాలు 2లో..

అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరును మరోసారి తప్పుబట్టారు సీఎం చంద్రబాబు. నదులు ఎక్కడ పుడతాయో, నాగరికత ఎక్కడ మొదలైందో జగన్ కి తెలియదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కు కనీసం సింధూ నాగరికత గురించి కూడా అవగాహన లేదని మండిపడ్డారు. నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు నదీతీరాల వెంబడి ఉన్నందునే అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాదు లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజలు బుద్ధి చెప్పినా.. రాజధానిపై

## నారా భువనేశ్వరికి ‘అవుట్‌స్టాండింగ్ డెయిరీ
# ప్రొఫెషనల్ల అవార్డు



- ★ మహిళా సాధికారతకు చేస్తున్న సేవలకు ప్రశంసలు
- ★ భువనేశ్వరి కృషి స్ఫూర్తిదాయకమన్న సీఎం చంద్రబాబు
- ★ ఈ గౌరవం పాడి రైతులకే చెందుతుందన్న భువనేశ్వరి

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం భువనేశ్వరి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మిగతా..2లో

## ఈడీ vs మమత- సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిన టీఎంసీ సర్కార్



- ఈడీ, బంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం
- ఐప్యాక్ కేసులో సుప్రీంకోర్టును ఈడీ ఆశ్రయించవచ్చనే ఊహాగానాలు
- ఈ నేపథ్యంలో ఈడీ కంటే ముందుగానే సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమత సర్కార్

ఢిల్లీ : బంగాల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), టీఎంసీ ప్రభుత్వం మధ్య వివాదం శనివారం సుప్రీంకోర్టుకు చేరింది. ఐప్యాక్ కార్యాలయాలు, డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసాలపై

## ఏదో ఒకరోజు ‘హిజాబ్ణ ధరించిన
# మహిళే ప్రధాని అవుతుంది

- పాకిస్థాన్ రాజ్యాంగంలా మనది కాదు- అంబేడ్కర్ రాజ్యాంగం అందరికీ అవకాశం ఇస్తుందన్న ఎంఐఎం చీఫ్
- ముందు మీ పార్టీ పగ్గాలు హిజాబ్ మహిళకు ఇవ్వగలరా అని బీజేపీ సవాల్



ఢిల్లీ : “ఏదో ఒక రోజు హిజాబ్ ధరించిన మహిళ కచ్చితంగా భారతదేశానికి ప్రధానమంత్రి అవుతుంది. ఇది నా కల” అని ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్రలోని షోలాపూర్?లో శుక్రవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వాన్ని, సమ్మిళితత్వాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ఎవరినైనా అత్యున్నత పదవిలో కూర్చోబెడుతుందని, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా ప్రధాని కావచ్చని ఆయన ఉద్ఘాటించారు. అయితే ఒవైసీ వ్యాఖ్యలపై బీజేపీ, శివసేన నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

### పాకిస్థాన్‌తో పోలిక

ఒవైసీ తన ప్రసంగంలో మిగతా..2లో

## పుతిన్‌ను కూడా అమెరికా అరెస్ట్ చేస్తుందా?’

- వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్ట్‌తో ప్రపంచ రాజకీయాల్లో సంచలనం
- పుతిన్‌పై కూడా ఇలాంటి చర్య తీసుకుంటారా అని ట్రంప్‌కు ప్రశ్న



వివరాలు 2లో..

ఢిల్లీ : వెనెజువెలా దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం ఆకస్మికంగా బంధించిన ఘటన అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఆ పరిణామం తర్వాత, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై కూడా అమెరికా ఇలాంటి సైనిక చర్య చేపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### ఎన్నో ఏళ్లుగా పుతిన్‌తో మంచి పరిచయం!

ఇటీవల డొనాల్డ్? ట్రంప్‌తో జరిగిన మీడియా సమావేశంలో యూఎస్ మీడియా ప్రతినిధులు కీలక ప్రశ్నలు సంధించారు. మదురో మాదిరిగానే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కూడా భవిష్యత్తులో బంధించేందుకు అమెరికా సైనిక చర్యలకు దిగుతుందా? అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ స్పందిస్తూ, ఎన్నో ఏళ్లుగా తనకు పుతిన్‌తో మంచి పరిచయం, స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు.

### ఎనిమిది యుద్ధాలను ఆపేశా

అయితే ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధం విషయంలో పుతిన్ వైఖరిపై ట్రంప్? తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు



- మహిళా ఐఏఎస్ అధికారి గురించి ఓ మీడియా సంస్థ తప్పుడు కథనాలు ప్రసారం చేయడాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.
- వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు.

# మనమే పరిష్కరించుకుందాం
## న్యాయస్థానాలు వద్దు.. కూర్చుని చర్చిద్దాం

- జల వివాదాలకు శాశ్వతంగా స్వస్తి చెబుదాం
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు నీటి అంశాలపై రాజకీయాలు మానుకోవాలని హితవు
- సుజెన్ మెడికేర్‌లో ఐవీ ఫ్లూయిడ్స్ యూనిట్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు


మిగతాది 2లో


హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని అడిగితే నీళ్లే కావాలని కోరుకుంటా. వివాదం కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని బదులిస్తా. వివాదాలు పరిష్కారమైతే ప్రజలు, రైతులు, పెట్టుబడిదారులకు ప్రయోజనాలు చేకూరుతాయి. తెలంగాణలో డేటా సెంటర్ల ఏర్పాటుకు చాలా సంస్థలు ముందుకు వస్తున్నాయి. వాటికి నీరు, విద్యుత్తు అవసరం. నీళ్లు కావాలంటే కృష్ణా జలాల వివాదం పరిష్కారం కావాలి.

### సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్; మహేశ్వరం, న్యూస్‌టుడే: ‘తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జల వివాదాలను శాశ్వతంగా పరిష్కరించుకుందాం..

## మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం.. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- ★ ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం దురదృష్టకరమన్న మంత్రి
- ★ కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా మీడియా కథనాలు సరికాదని వ్యాఖ్య
- ★ రేటింగ్, వ్యూస్ కోసం అధికారుల మీద అభాండాలు వేయవద్దన్న మంత్రి


2లో..

ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక PRAJASWAMYAM TELUGU DAILY

ఆదివారం- 11 - జనవరి - 2026

మొదటి పేజి తరువాయి

## నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియని వ్యక్తి జగన్

ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నారని జగన్ పై నిప్పులు చెరిగారు చంద్రబాబు. 'ఏపీలో రానున్న రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించాం. దేశంలోనే ఉద్యానవన రంగంలో అగ్రస్థానంలో ఉన్నాం. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్-1గా నిలుస్తాం. దేశంలో ప్రతి రాష్ట్రం మనల్ని చూసి నేర్చుకునేలా ముందుకు సాగుతాం. నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనుకోవడం తప్పా?. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్న విషయం ఆయనకి అర్థం కావడం లేదు. రాయలసీమకు నీరు అందించామనడానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ. పట్టిసీమ ద్వారా రాయలసీమపై మాకున్న చిత్తశుద్ధిని చాటుకున్నాం. అందుకే ప్రజలు మా పాలన కోరుకున్నారు. పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి పూర్తి చేయకుండా 2020లోనే నిలిపివేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు క్లయిమ్ చేసుకున్నారంటే ఆ ప్రభుత్వంలో దోపిడి ఏ విధంగా జరిగిందన్న విషయం ప్రజలు గమనించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చే సత్తా మాకుంది. తెలంగాణతో మాకు ఉన్న సమస్యలు పరిష్కరించుకుంటాం. రాజకీయాల కోసం సెంటిమెంట్లు రెచ్చగొట్టం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

## నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ల అవార్డు

ఈ పురస్కారం ఆమెకు, ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (సౌత్ జోన్) నారా భువనేశ్వరికి 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ల అవార్డును ప్రకటించింది. డెయిరీ రంగంలో ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు అందుకోవడంపై భువనేశ్వరి స్పందించారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన ఇండియన్ డెయిరీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారత డెయిరీ రంగం అభివృద్ధి, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని ఆమె మరోసారి స్పష్టం చేశారు.

## పనులు శరవేగంగా సాగుతున్నాయంటూ మంత్రి లోకేశ్ ట్వీట్

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ ఏర్పాటు చేస్తున్న భారీ తయారీ ప్లాంట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రూ.5,000 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పురోగతిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, యువతకు ఉద్యోగ కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని చెప్పడానికి ఈ ప్రాజెక్టే నిదర్శనమని పేర్కొన్నారు. 247 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది మే 2025లో ఈ ప్రాజెక్టుకు భూమిని అప్పగించగా, అతి తక్కువ సమయంలోనే నిర్మాణ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించడంపై లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో ఎల్జీ ఏర్పాటు చేస్తున్న మూడో ప్లాంట్ ఇది. ఈ యూనిట్‌లో రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లతో పాటు కీలకమైన విడిభాగాలను కూడా ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో తయారీ రంగ పర్యావరణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రణాళిక ప్రకారం 2026 చివరి నాటికి ఈ ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించి, 2029 వరకు దశలవారీగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మియాపూర్ లో రూ.3 వేల కోట్లకు పైగా విలువైన భూమికి హైడ్రా రక్షణ

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు గతంలోనే ఐదు ఎకరాలను స్వాధీనం చేసుకుని, చెరువు కట్టపై నిర్మించిన 18 అక్రమ షెట్టర్లను తొలగించారు. అయితే, ఇదే భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, సంబంధిత సబ్-రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారనే వార్తల నేపథ్యంలో హైడ్రా అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. ఈ విచారణలో, సర్వే నంబర్ 159కి చెందిన పత్రాలను ఉపయోగించి సర్వే నంబర్ 44లోని మొత్తం 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఎకరంన్నర భూమిని కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తాజాగా పూర్తిస్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా, ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసింది.

## మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం.. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్: మహిళా ఐఏఎస్ అధికారుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మీడియాలో వచ్చిన కథనాలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓ మహిళా ఐఏఎస్‌పై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు. కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా మీడియా కథనాలు రాయడం సరికాదని హితవు పలికారు. నల్గొండ జిల్లాలోనే కాదని, చాలా జిల్లాల్లో కలెక్టర్ల బదిలీలు జరిగాయని ఆయన అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు తెలియకుండానే ఈ ప్రక్రియ జరుగుతుందని వ్యాఖ్యానించారు. అధికారుల మీద అభాండాలు వేయడం సరికాదని అన్నారు. రేటింగ్‌లు, వ్యూస్ కోసం కాకుండా, వాస్తవాలు రాయాలని సూచించారు. ఛానళ్ల మధ్య రేటింగ్ పోటీ కోసం అధికారులను, ముఖ్యంగా మహిళా అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. కేవలం మంత్రుల పైనే కాదని, ముఖ్యమంత్రిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మీడియా సంస్థలు అలా చేయడం సరికాదు

హైదరాబాద్, జనవరి 10 : తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నించారాయన. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్.

### శ్వేతపత్రం విడుదల చేయాలి..

'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలి. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోంది. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు వచ్చేదేమీ లేదు. పేర్ల మార్పునకు ముందు ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

### సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా 10 ప్రత్యేక రైళ్లు

వారిని దృష్టిలో ఉంచుకుని సగానికి పైగా జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఛైర్ కార్ బోగీలలో ప్రయాణించాలనుకునే వారు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ముందస్తుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు.

### రైళ్ల షెడ్యూల్ వివరాలు:



హైదరాబాద్ నుంచి విజయవాడకు జనవరి 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6:10 గంటలకు రైలు బయలుదేరుతుంది. అదేవిధంగా, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు జనవరి 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2:40 గంటలకు రైలు అందుబాటులో ఉంటుంది. సంక్రాంతి సమయంలో సాధారణ రైళ్లపై ఒత్తిడి తగ్గించేందుకే ఈ అదనపు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

# పుతిన్‌ను కూడా అమెరికా అరెస్ట్ చేస్తుందా?'

మొదటి పేజి తరువాయి



"ఈ యుద్ధం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా సైనికులు పెద్ద సంఖ్యలో మరణిస్తున్నారు. ఈ పరిస్థితి నన్ను తీవ్రంగా కలిచివేస్తోంది" అని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను ఆపినట్లు ట్రంప్ మరోసారి గుర్తు చేశారు.

### ఆ ప్రయత్నాలు కొనసాగిస్తూనే!

అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాత్రం ఇప్పటివరకు విజయం సాధించలేకపోతున్నానని చెప్పారు. "ఈ యుద్ధాన్ని ఆపడం చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ దీన్ని ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుతిన్‌పై సైనిక చర్యలు చేపడతారా అనే ప్రశ్నకు ట్రంప్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. పుతిన్‌ను బంధించేందుకు లేదా రష్యాపై సైనిక చర్యలకు దిగే ఆలోచన తనకు లేదని తేల్చి చెప్పారు. అయితే ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు దిశగా రష్యాపై రాజకీయ, దౌత్యపరమైన ఒత్తిడి మాత్రం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థించిన విషయం తెలిసిందే.

పుతిన్‌ను ఉద్దేశించి జెలెన్‌స్కీ ఇలా!

ఈ ఘటనపై స్పందించిన జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ అరెస్టు అంశాన్ని ప్రస్తావించారు. "నియంతలను ఇలాగే ఎదుర్కోవడం సాధ్యమైతే, అలాంటి వారి విషయంలో ఏం చేయాలో అమెరికాకు బాగా తెలుసు" అంటూ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ వ్యాఖ్యలు పుతిన్‌ను ఉద్దేశించి చేసినవేనని అంతర్జాతీయ రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై దాడుల పరంపరను కొనసాగిస్తున్న పుతిన్‌ను కూడా ట్రంప్ ఇదే తరహాలో హ్యాండిల్ చేయాలని ఆయన సూచించినట్లుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర అసంతృప్తి

ఒకవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో స్నేహం ఉందని చెబుతూనే, మరోవైపు ఉక్రెయిన్ యుద్ధంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేయడం గమనార్హం. అలాగే సైనిక చర్యలు కాకుండా, దౌత్య మార్గాల్లోనే రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వెనెజువెలా అధ్యక్షుడు మదురో అరెస్టు ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరలేపగా, పుతిన్‌పై కూడా ఇలాంటి చర్యలు ఉంటాయా అనే ప్రశ్నలకు ట్రంప్ ఇప్పుడు ఇచ్చిన సమాధానం స్పష్టతనిచ్చినట్లైంది. ఉక్రెయిన్?త- రష్యా యుద్ధం ముగింపే తన లక్ష్యమని, అయితే దానికోసం సైనిక మార్గాన్ని ఎంచుకోనని ట్రంప్ మరోసారి క్లారిటీ ఇచ్చారు.

# ఏదో ఒకరోజు 'హిజాబ్ణ ధరించిన మహిళే ప్రధాని అవుతుంది

మొదటి పేజి తరువాయి

పొరుగు దేశం పాకిస్థాన్ రాజ్యాంగంతో భారత రాజ్యాంగాన్ని పోల్చి మాట్లాడారు. "పాకిస్థాన్ రాజ్యాంగం ప్రకారం, కేవలం ఒక మతానికి చెందిన వ్యక్తి మాత్రమే ఆ దేశానికి ప్రధాని కాగలరు. కానీ అంబేద్కర్ రాసిన మన రాజ్యాంగం అలా కాదు. భారతదేశంలో ఏ పౌరుడైనా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మేయర్ కావచ్చు. అందుకే ఏదో ఒక రోజు హిజాబ్ కట్టుకున్న మా ఆడబిడ్డ ఈ దేశానికి ప్రధాని అవుతుందని నేను నమ్ముతున్నాను" అని ఒవైసీ అన్నారు.

### ప్రేమ గెలుస్తుంది

ముస్లింలపై జరుగుతున్న విద్వేష ప్రచారంపైనా ఒవైసీ స్పందించారు. "ముస్లింలపై మీరు చిమ్ముతున్న విషం ఎక్కువ కాలం సాగదు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే వారి అంతం త్వరలోనే చూస్తాం. ఏదో ఒక రోజు ప్రేమ సాధారణమవుతుంది. అప్పుడు ప్రజలకు అర్థమవుతుంది, తమ మెదళ్లను ఎలా విషపూరితం చేశారో వారు గ్రహిస్తారు" అని వ్యాఖ్యానించారు.

### కాంగ్రెస్‌పైనా ఫైర్

ఇదే సభలో మాజీ కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం, కాంగ్రెస్ పార్టీపై కూడా ఒవైసీ విరుచుకుపడ్డారు. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ రాకపోవడానికి కాంగ్రెస్ తెచ్చిన చట్టాలే కారణమని ఆరోపించారు. "కాంగ్రెస్ హయాంలోనే యుఏపీఏ చట్టాన్ని కఠినతరం చేశారు. ఉగ్రవాదం నిర్వచనాన్ని మార్చింది మీరే. ఆనాడు నేను చెప్పాను, ఈ చట్టం దుర్వినియోగం అవుతుందని హెచ్చరించాను. ఈరోజు అదే చట్టం వల్ల ఇద్దరు యువకులు ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్నారు. వారికి బెయిల్ రావడం లేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ కాంగ్రెస్ నాయకుడైనా ఐదేళ్లు జైల్లో ఉన్నారా?" అని ప్రశ్నించారు.

### హిమంత కౌంటర్

ఒవైసీ వ్యాఖ్యలపై అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తనదైన శైలిలో స్పందించారు."రాజ్యాంగపరంగా ఎవరికీ అడ్డంకి లేదు. ఎవరైనా ప్రధానమంత్రి కావచ్చు. కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. భారతదేశం హిందూ నాగరికత కలిగిన దేశం. మేము ఎప్పుడూ ఒకటే నమ్ముతాం. భారత ప్రధానమంత్రి ఎప్పుడూ ఒక హిందువే అయి ఉంటారు. దీనిపై మాకు పూర్తి విశ్వాసం ఉంది" అని హిమంత బిశ్వ శర్మ తేల్చిచెప్పారు.

మీ పార్టీ అధ్యక్షురాలిని చేయగలరా? - బీజేపీ

ఒవైసీ వ్యాఖ్యలకు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా గట్టి కౌంటర్ ఇచ్చారు. "రాజ్యాంగం ఎవరినీ అడ్డుకోదు. హిజాబ్ ధరించిన వారు కూడా ప్రధాని కావొచ్చు. కానీ మియాన్ ఒవైసీ, మీకు నేను ఒక సవాల్ విసురుతున్నా. ముందుగా ఒక 'పస్మాండా' ముస్లిం మహిళను లేదా హిజాబ్ ధరించిన మహిళను మీ



పార్టీ అధ్యక్షురాలిగా చేయండి. దేశం గురించి తర్వాత మాట్లాడుదురు గాని, ముందు మీ పార్టీలో ఆ పని చేసి చూపించండి" అని 'ఎక్స్' వేదికగా ఎద్దేవా చేశారు.

### పీఎం పోస్ట్ ఖాళీ లేదు - శివసేన

శివసేన అధికార ప్రతినిధి షైనా ఎన్‌సీ కూడా ఒవైసీకి చురకలు అంటించారు. "ప్రస్తుతానికి ప్రధానమంత్రి కుర్చీ ఖాళీగా లేదు. నరేంద్ర మోదీ ప్రజాదరణ ఏంటో అందరికీ తెలుసు. ముందు మీ ఎంపీలను గెలిపించుకోండి. ఆ తర్వాత ప్రధాని పదవి గురించి కలలు కనండి. భవిష్యత్తులో మహిళా ప్రధానిని మేము కూడా కోరుకుంటాం. కానీ అది కులం, మతం, వస్త్రధారణ ఆధారంగా కాదు, కేవలం ప్రతిభ ఆధారంగా ఉండాలి" అని ఆమె స్పష్టం చేశారు.

# ఈడీ VS మమత- సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిన టీఎంసీ సర్కార్

మొదటి పేజి తరువాయి

ఈడీ దాడుల వ్యవహారం ఇప్పుడు న్యాయపోరాటానికి దారితీసింది. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరుతూ బంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చుననే ఊహాగానాల మధ్య మమతా సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కోట్ల రూపాయల బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా గురువారం కోల్‌కతాలోని ఐప్యాక్ కార్యాలయం, ప్రతీక్ జైన్ ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ దాడుల సమయంలో బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడికి చేరుకోవడం తీవ్ర కలకలం రేపింది. సీఎం మమతా బెనర్జీ దాడులు జరుగుతున్న చోటుకు చేరుకుని, తమ ఆధీనంలో ఉన్న కీలకమైన భౌతిక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను బలవంతంగా తీసుకెళ్లారని ఈడీ ఆరోపించింది. పోలీసుల సాయంతో ఆమె దర్యాప్తుకు ఆటంకం కలిగించారని, సాక్ష్యలను మాయం చేశారని పేర్కొంటూ ఈడీ శుక్రవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని కోరింది. ఈ ఆరోపణలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తాను అక్కడికి వెళ్లడాన్ని ఆమె సమర్థించుకున్నారు. ఈడీ అధికారులు దర్యాప్తు పేరుతో ఓటర్ల రహస్య



సమాచారాన్ని, బూత్ లెవల్ ఏజెంట్ల వివరాలు, సామాన్య ప్రజల విన్నపాలను తీసుకెళ్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఉదయం 6 గంటలకే అధికారులు కార్యాలయంలోకి ప్రవేశించారని, తాను కొన్ని గంటల తర్వాత అక్కడికి వెళ్లానని చెప్పారు.

అసలేంటీ ఈ వివాదం?

బంగాల్‌లోని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ మైన్స్‌లో వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దొంగతనానికి గురైనట్లు 2020లో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నగదు అక్రమ చలామణి జరిగినట్లు తేలడంతో ఈడీ రంగంలోకి దిగింది. స్థానిక వ్యాపారి అనూప్ మాఝీ (లాలా) ఇందులో ప్రధాన నిందితుడిగా గుర్తించింది. అయితే, ఇదే కేసులో తృణమూల్ ఎంపీ, మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీని గతంలోనే ఈడీ ప్రశ్నించింది. ఈ క్రమంలోనే కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న ఐ-ప్యాక్ కార్యాలయంలో, దిల్లీలోని నాలుగు చోట్ల ఈడీ సోదాలు నిర్వహించింది. కొన్ని హవాలా లావాదేవీలు, నగదు వ్యవహారాలు ప్రతీక్ జైన్ ద్వారా జరిగినట్లు నిర్దిష్ట ఆధారాలు ఉన్నాయని ఈడీ ఆరోపిస్తోంది. బొగ్గు స్మగ్లింగ్ రాకెట్‌తో సంబంధం ఉన్న ఒక హవాలా ఆపరేటర్ ద్వారా ఐ-ప్యాక్‌కు చెందిన 'ఇండియన్ పీఏసీ కన్సల్టింగ్ ప్రైవేట్? లిమిటెడ్?కు రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయని ఈడీ వర్గాలు తెలిపాయి. అయితే రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్? కిశోర్? నేతృత్వంలో ఆవిర్భవించిన ఐప్యాక్?, బంగాల్?లో తృణమూల్? పార్టీ ఐటీ, ప్రచార బాధ్యతలను చూస్తోంది. మరోవైపు, ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ సహా ఆ సంస్థ కార్యాలయాలపై ఈడీ దాడులను నిరసిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం భారీస్థాయిలో ఆందోళనను చేపట్టారు. ఆమె నాయకత్వంలో జరిగిన ఈ మెగా ర్యాలీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోల్‌కతాలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం బయట తృణమూల్ ఎంపీలు కూడా నిరసన చేపట్టారు. ఇదిలా ఉండగా, ఈ వివాదంపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. చట్టబద్ధమైన పాలనకు బంగాల్ అతీతమని మమతా బెనర్జీ చూపించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించింది. ఎన్నికల ముందు ఆమె ఇలాంటి పనులే చేస్తున్నారని ఎద్దేవా చేసింది. తాము ఈ ర్యాలీని ముందే ఊహించామని పేర్కొంది.

# మనమే పరిష్కరించుకుందాం

మొదటి పేజి తరువాయి



ఈ అంశాలపై పంచాయితీలు, న్యాయస్థానాలు వద్దు.. మనమే కూర్చుని చర్చిద్దాం' అని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ఫ్యాబ్‌సిటీలో సుజెన్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ సంస్థను శుక్రవారం ప్రారంభించిన ఆయన..అనంతరం అక్కడి సభలో మాట్లాడారు. "నీళ్ల వివాదాలపై పదేపదే చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా మాట్లాడుకుందాం. న్యాయస్థానాల వద్దకు, పెద్దమనుషుల పంచాయితీలకు వెళ్లాల్సిన అవసరం లేదు. కృష్ణా నదిపై ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, డిండి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు వంటివి ఉమ్మడి రాష్ట్రంలోనే మంజూరైన ప్రాజెక్టులు. వీటికి అభ్యంతరాలు వ్యక్తం చేయకండి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నా.. నీటి అంశాలు, నీళ్ల వివాదాల ముసుగులో రాజకీయ ప్రయోజనాలను కోరుకోవద్దు. కృష్ణా జలాల అంశాన్ని రాజకీయ లబ్ధికి వినియోగించుకోవద్దు. దానివల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవు.

మీరు ఒక అడుగు ముందుకు వేస్తే.. మేం పది అడుగులు ముందుకు వేస్తాం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజూరైన సాగునీటి ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం అడ్డు పడడం వల్ల మాకు పర్యావరణ, ఇతర అనుమతులు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ సైతం ఆగిపోయాయి. సాగునీటి ప్రాజెక్టులకు 60 శాతం నిధులు కేంద్రం నుంచి రాకపోవడంతో.. రాష్ట్రంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. మనకు తగినన్ని నీళ్లు లేవు... ఓడరేవు లేదు. ఈ నేపథ్యంలో భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారితోపాటు దానికి సమాంతరంగా రైల్వేలైన్ ఉండేలా అనుమతులివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం కావాలి. మాకు ఏపీ సహకరిస్తే.. అమరావతి నిర్మాణానికి మేం సహకరిస్తాం. ఎందుకంటే భవనాలు కడితే సరిపోదు.. భవనాల్లో పరిశ్రమలు రావాలి.. తెలంగాణలో సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరులు ఉన్నాయి. ఇందుకోసం రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకొనేలా చర్చలు కొనసాగుతాయి. ఏపీతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతోనూ కృష్ణాజలాల అంశంపై చర్చలు కొనసాగించనున్నాం. మీరు ఒక అడుగు ముందుకు వేస్తే.. మేం పది అడుగులు ముందుకు వేస్తాం. ఎవరైనా సరే.. అభివృద్ధికి సహకరిస్తామంటూ ముందుకు వస్తామంటే పది అడుగులు ముందుకు వేసే గుణం తెలంగాణ రక్తంలోనే ఉంది. సుజెన్ మెడికేర్ సంస్థ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో నిర్మలా జగ్గారెడ్డి, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, పట్నం మహేందర్‌రెడ్డి, సుజెన్ మెడికేర్ ప్రతినిధి మనీషా తదితరులు

### ఐటీ, ఫార్మా రంగాల్లో విదేశీ నగరాలతో పోటీ..

ఐటీ, ఫార్మా రంగాల్లో విదేశీ నగరాలతో పోటీ పడుతున్నాం. విదేశీ నగరాలకు దీటుగా ఐటీ, ఫార్మా సంస్థలు, జీసీసీలు హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్నాయి. ఈ క్రమంలో పెట్టుబడులు పెట్టేవారికి రక్షణగా, లాభాలొచ్చే విధంగా విధానాలను రూపొందించాం. రాష్ట్రాన్ని క్యూర్.. ప్యూర్.. రేర్ విభాగాలుగా వర్గీకరించి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ సమిట్-2047లో ప్రవేశపెట్టిన దార్శనిక పత్రంలోని అంశాలను విపులంగా వివరించేందుకు ముఖ్యమంత్రి ఈ నెల 19న దావోస్‌లోని వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరవుతున్నారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎండీ కె.శశాంక, రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి, నేతలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, తీగల అనితారెడ్డి, సుజెన్ మెడికేర్ సంస్థ డైరెక్టర్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ కలకలం.. మరో హిందువుపై దాడి..

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సునామ్‌గంజ్ జిల్లాలో జై మహాపాత్ర (జాయ్ మహాపాత్రో) అనే యువకుడిపై దుండగులు దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సునామ్‌గంజ్ జిల్లాలో జై మహాపాత్ర (జాయ్ మహాపాత్రో) అనే యువకుడిపై దుండగులు దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సునామ్‌గంజ్ జిల్లాలోని భంగడోహర్ గ్రామానికి చెందిన జై మహాపాత్రను గురువారం ఓ స్థానిక షాపునకు పిలిపించి దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని సిల్హెట్ ఎంఏజీ ఉస్మానీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ దాడి ముందే పథకం ప్రకారం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దాడి అనంతరం అమీరుల్ ఇస్లాం అనే వ్యక్తి విషం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది.

### 35 రోజుల్లో 11 మంది హిందువుల హత్యలు?

బంగ్లాదేశ్‌లో గత కొన్ని వారాలుగా హిందువులపై హింస తీవ్రరూపం దాల్చుతోంది. గత 35 రోజుల్లో 11 మంది హిందువులు హత్యకు గురైనట్లు సమాచారం. రాడికల్ యాంటీ ఇండియా నేత షరీఫ్ ఒస్మాన్ హాది మరణానంతరం ఈ దాడులు మరింత పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల మైమెన్సింగ్ జిల్లాలో 27 ఏళ్ల దీపు చంద్ర దాస్ కొట్టిచంపబడగా, డిసెంబరు 24న రాజ్‌బరీ జిల్లాలో అమృత్ మండల్‌ను గుంపు దాడి చేసి హతమార్చింది. ఆ తర్వాత మైమెన్సింగ్‌లో బజేంద్ర బిస్వాస్ కాల్చి చంపబడ్డాడు. షరియత్‌పూర్ జిల్లాలో ఖోకన్ దాస్‌ను తగలబెట్టి చంపగా, జనవరి 5న జెస్సోర్‌లో జర్నలిస్టు రణ ప్రతాప్ బైరాగి కాల్పుల్లో మృతి చెందాడు. మరుసటి రోజే నర్సింగ్డీ జిల్లాలో శరత్ మణి చక్రవర్తి హత్యకు గురయ్యాడు.

అమెరికా వీసా ప్రీమియం ఫీజు పెంపు.. స్టూడెంట్స్, టెక్కీలపైనే అధిక భారం

భారత్ ఖండన..

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ, 'మైనారిటీలపై పదే పదే జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలను వ్యక్తిగత వైరం లేదా రాజకీయ కారణాలుగా చూపించే ప్రయత్నాలు కూడా కలవరపెడుతున్నాయి' అని ఆయన అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై అంతర్జాతీయంగా ఆందోళన పెరుగుతున్న వేళ, తాజా ఘటన మరోసారి కలకలం రేపుతోంది.

ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)



# శివాలయంలో "సోమనాథ స్వాభిమాన్ పర్వ్"



ప్రజాస్వామ్యం / గజపతినగరం: స్థానిక శివాలయంలో శనివారం సోమనాథ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమం బి.జె.పి ఆధ్వర్యంలో ఘనముగా చేపట్టారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మేటికోటి భాస్కరరావు మాట్లాడుతూ, గుజరాత్ రాష్ట్రంలో సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని వెయ్యి సంవత్సరాల క్రితం మహమ్మదీయులు మన దేశంపై దండ యాత్ర చేసిన సమయంలో ధ్వంసం చేశారని, ఆ తర్వాత పున్నర్నిర్మించడం, ఇలా స్వాతంత్ర్యం వచ్చే ముందు వరకు ధ్వంసము చేయడం జరుగుతూ ఉండేదని వివరించారు. 1947లో స్వాతంత్రం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ జ్యోతిర్లింగాలయాన్ని నిర్మిద్దామని ఆలోచన చేయగా, అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ వ్యతిరేకించారన్నారు. అయినా పట్టువదలని సర్దార్ వల్లభాయ్ పటేల్ అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా 1951 సంవత్సరంలో స్వామినాథ జ్యోతిర్లింగా ఆలయాన్ని పునర్ నిర్మించడం జరిగిందన్నారు. ఈ చరిత్రను ప్రజలకు తెలియచేయాలనే సంకల్పంతో ప్రధాని మోడీ ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా తలపెట్టారన్నారు. అందరికీ తెలియపరచడం కోసం మోడీ గారు పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని జరిపించడం జరిగినది ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షులు దొగ్గ దేవుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ఆరిశెట్టి ఏడుకొండలు, మండల ప్రధానకార్యదర్శి కావుపాటి తౌడు, తవిటి నాయుడు,మాజీ సర్పంచ్, గురుస్వామి కందుల చిన్నయ్య స్వామి, శంకర్ శాస్త్రి, భువనేశ్వర్ శర్మ, వేద పండితులు పాల్గొన్నారు.

# గ్రౌండింగ్ అయిన ఉపాధి పనులన్నీ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి కావాలి

### రాష్ట్ర మంత్రి - కొండపల్లి శ్రీనివాస్





ప్రజాస్వామ్యం – విజయనగరం: జిల్లాలో గ్రౌండింగ్ అయిన ఉపాధి పనులన్నీ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి కావాలని రాష్ట్ర , ఎం.ఎస్.ఎం.ఈ ,సెర్ప్, ఎన్నారై శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంత్రి కాంప్ కార్యాలయంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ అధికారులతో ఉపాధి పనులు పై సమీక్షించారు. స్మశానాలు లేని గ్రామాలకు, ఎస్.సి కాలనీలకు స్మశానాల పనులకు ప్రతిపాదనలు తయారుచేయాలని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ భవనాలను, గోశాలలను వేగంగా పూర్తి చేసి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. మెటీరియల్ కపోనెంట్ ను ఈ ఆర్థిక సంవత్సరం లో పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పి.డి శారదా దేవి, పంచాయతి రాజ్ ఎస్.ఈ శ్రీనివాస్ రావు, ఏ.ఈలు, డి.ఈ లు పాల్గొన్నారు.

# యువతే దేశానికి వెన్నెముక డి.ఎస్.పి - భవ్యరెడ్డి





ప్రజాస్వామ్యం / గజపతినగరం: యువతే దేశానికి వెన్నెముక అని బొబ్బిలి డిఎస్పి జి.భవ్యరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో డీఎస్పీ జి.భవ్యరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత స్వామి వివేకానంద ఆశయాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి ఉపయోగించడం వలన కలిగే అనర్థాలను డి.ఎస్.పి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఏ.వి. రమణ, సబ్ ఇన్స్పెక్టర్ కె. కిరణ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

# రాజధానిని అడ్డుకోవాలని మాజీ సీఎం జగన్ కుట్ర టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ధ్వజం



ప్రజాస్వామ్యం భీమునిపట్నం అర్థంపర్థం లేని విషయాన్ని తెరమీదకు తెచ్చి తెలుగువారి కలల రాజదానిని ఎలాగైనా అడ్డుకోవాలనే కుతంత్రంలో మాజీ సిఎం జగన్ రెడ్డి ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు ధ్వజమెత్తారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రుల కలల రాజదాని నిర్మాణంపై తెలుగు వారితో పాటు ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న వేళ వైసీపీ అధినేత జగన్ మాత్రం ఇంకా తన వంకరబుద్దిని వదులుకున్నట్లు లేదని ఎద్దేవా చేసారు. లివర్ బేసిన్ లో రాజదాని నిర్మాణం చేపడుతున్నారని, సుప్రీం కోర్టు కలుగజేసుకోవాలని మీడియా ముందుకు వచ్చి వితండవాదం చేయడం వెనుక ఆయన అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. నదీ పరివాహక ప్రాంతం లో రాజదాని నిర్మాణం చేపడుతున్నారని అబద్దాలు ఎలా చెప్పగలుగుతున్నారని కృష్ణా నదికి ఆరు కిలోమీటర్ల దూరంలో అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు, ఇతర భవనాలు నిర్మించి అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే అమరావతి నిర్మాణం జరుగుతుందన్న విషయం జగన్ రెడ్డికి తెలియదా...? అని ప్రశ్నించారు. కృష్ణా నదికి రెండు కిలోమీటర్ల దూరంలో జగన్ ప్యాలస్ ఉందని దాని పరిస్థితి ఏంటని నిలదీశారు. రాజ్యాంగంలో రాజదాని అనే పదమే లేదని ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజదాని అని వితండ వాదం చేయడం నీ విజ్ఞతకే వదిలేసు న్నామని అన్నారు. అలా అయితే ప్రతీ రాష్ట్రానికి రాజదాని ఉందని, దేశానికి ఢిల్లీ రాజ దానిగా ఉందని వాటి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రపంచం అంతా ఆంధ్రా వైపు చూస్తుందని, ముఖ్యంగా అమరావతి రాజదాని నిర్మాణంపై అందరి చూపులు ఉన్నాయని, ప్రతీ ఆంధ్రుడు అమ రావతి ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇంతమంచి పరిణామంలో మీ పనికిమాలిన వితండ వాదం ఏమిటని నిలదీశారు. కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షముగా ఉందని, యువత, మహిళలు, వృద్దులు, ఉద్యోగస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఇక మీ విషపు ప్రయోగాలు ఆపండి అని గంటా నూకరాజు హితవు పలికారు.

# 21న డైట్ కళాశాలలో జిల్లాస్థాయి 'రంగోత్సవ్' పోటీల

ప్రజాస్వామ్యం భీమునిపట్నం, పట్టణంలోని డైట్ కళాశాలలో ఈనెల 21న జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్టు కళాశాల ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ జీజీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. పిల్లల్లో ఆనందం, ఉత్సాహం పెంపొందించేందుకు ప్రభు త్వం ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చిత్రలేఖనం, చేతి రాత, రంగోలి, జానపద నృత్యం, రోలే విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. చిత్రలేఖనం పోటీలో భారత స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు వేయాల్సి ఉంటుంది. చేతి రాతలో (తెలుగు, ఇంగ్లీష్) ఒక పేరాగ్రాఫ్ లేదా ఒక కొటేషన్ రాయాల్సి ఉంటుంది. రంగోలి పోటీల్లో వికసిత్ భారత్ అంశంపై మూడు నుంచి నలుగురు సభ్యులు ముగ్గు వేయాలి. జానపద నృత్యంలో పం జాబీ/ఆంధ్రప్రదేశ్ జానపద నృత్యం నలుగురైదుగురు సభ్యులుండాలి. రోల్ ప్లేలో వికసిత్ భారత్ అంశంపై 3, 4 మంది సభ్యులతో భారత సంస్కృతి, చరిత్ర, విలువల వికసిత్ భారత్పై ఆధారిత దృశ్య ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. ఈ పోటీలకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు అర్హులు. ఒక విద్యార్థి ఒక్క పోటీలో మాత్రమే పాల్గొనాలి. జిల్లా స్థాయిలో విజేతలు ఈనెల 23న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 9441465299, 6281571165 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.

# సత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు.





విజయనగరం: ప్రజాస్వామ్యం /సత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సభ్యురాలు డా. బొత్స అనుషా, కళాశాల సంచాలకులు డా. శశిభూషణ రావు, ఆయన సతీమణి శ్రీమతి. అనురాధ భూషణ్ ప్రత్యేక అతిథులు గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శశిభూషణ రావు మాట్లాడుతూ, సంక్రాంతి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంప్రదాయ విలువలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. గ్రామీణ జీవన శైలి, పండుగల ప్రాముఖ్యతను యువత తెలుసుకోవడం అవసరమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ స్నేహభావం, ఐక్యతను పెంపొందించే పర్వదినమని అన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకతను పెంచుతాయని తెలిపారు. డా. అనుషా మాట్లాడుతూ, విద్యార్థులు తమ మూలాలను మరవకుండా ముందుకు సాగాలని సూచించారు. పండుగల ద్వారా కుటుంబ, సమాజ విలువలు మరింత బలపడతాయని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు కు ముగ్గులు, మెహంది, గాలిపటాలు, తెలుగమ్మాయి, తెలుగబ్బాయి మరియు సంప్రదాయ వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగవల్లులు, భోగి మంటలు, గంగిరెద్దులు, హరిదాసులు, బొమ్మలకొలువు, పొంగలి వంట, సంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# భవిష్యత్తును నాశనం చేసే వ్యసనాలకు యువత దూరం కావాలియువతను ఉద్దేశించి ప్రసంగించిన

### - విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్





ప్రజాస్వామ్యం న్యూస్ /విజయనగరం పట్టణం గురజాడ కళా క్షేత్రంలో 'చేయూత' ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.రాము గారి ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని జనవరి 10న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిధిగా హాజరై, ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసి, వివేకానందుని చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – వివేకానంద స్వామి జన్మదినానికి గుర్తుగా ప్రతీ ఏడాది యువజన దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ దేశానికి యువతే వెన్నుముక, యువతే దేశాన్ని అన్ని రంగాల్లోను ముందుండి నడిపిస్తున్నారని వివేకానందుడు బలంగా విశ్వసించేవారన్నారు. వివేకానందుని స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్ళాలని, యువతలో చైతన్యం నింపాలనే సంకల్పంతో చేయూత ఫౌండేషను ఆధ్వర్యంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించకోవడం, పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడం అభినందనీయమన్నారు. దేశానికి వెన్నుముకగా నిలవాల్సిన యువత ఇటీవల కాలంలో దురదృష్టవసాత్తు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. మద్యం, మత్తును కలిగించే గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు లోనై, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నా రన్నారు. ఇటీవల గంజాయి కేసుల్లో అరెస్టు అయిన వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారన్నారు. తెలిసీ, తెలియని వయస్సులో మత్తుకు బానిసలవ్వడంతోపాటు, ప్రలోభాలకు లొంగడం, వ్యసనాలకు పెద్ద సంఖ్యలో డబ్బులు అవసరం కావడంతో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతూ, ఎన్.డి.పి.ఎస్. కేసుల్లో నిందితులుగా మారుతున్నారన్నారు. గంజాయిని వినియోగించినా, విక్రయించినా, రవాణకు పాల్పడినా చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని, ఈ తరహా నేరాలకు పాల్పడితే ఏదో ఒక రోజు జైలుకు పోకతప్పదని యువతను తీవ్రంగా హెచ్చరించారు. గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని, తీవ్రమైన నేరంగా పరిగణించి, కఠినమైన శిక్షలను కూడా విధిస్తుందన్నారు. మనకు తెలిసిన స్నేహితుల్లో కూడా ఈ తరహా అలవాట్లు ఉంటే వారికి దూరంగా ఉండాలన్నారు. లేకుంటే వారితోపాటు మీరు కూడా క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారుతారన్నారు. ఎవరైనా గంజాయి కలిగివున్నారనిగాని, సేవిస్తున్నారనిగాని తెలిస్తే వెంటనే 100/112కు గాని 1972కు గాని సమాచారం అందించాల న్నారు. చదువుకునే సమయంలో చెడు వ్యసనాలకులోనై, ఉన్నత లక్ష్యాలకు దూరమైతే వారి భవిష్యత్తు అంధకార మేనన్నారు. అదే విధంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలను నడపొద్దన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల న్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదానికి గురైనా, స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడవచ్చు నన్నారు. అదే హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపి ప్రమాదానికి గురైతే, తలకు తీవ్రమైన గాయాలై, ప్రాణాలను కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అమ్మ మనకు జన్మనిస్తే, హెల్మెట్ పునర్జన్మ ఇస్తుందన్నారు. కావున, మీ కుటుంబ సభ్యులెవ్వరైనా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపితే, వారిని వారించాలని, తప్పనిసరిగా వారు హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి పొరపాటున ప్రమాదాల్లో మరణిస్తే, వారి కుటుంబం చిన్నాభిన్నమై పోతుందన్నారు. కావున, ప్రతీ ఒక్కరూ భద్రత ప్రమాణాలను పాటించాలని, మన చుట్టు ప్రక్కల వాళ్ళు కూడా భద్రత పాటించే విధంగా చూడాలన్నారు. మైనరు బాలికల అవగాహనారాహిత్యం వలన సోషల్ మీడియా ప్రభావంతో ఆకర్షణలకులోనై, లైంగిక దాడులకు గురవుతూ, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నార న్నారు. బాలికలపై లైంగిక దాడులను నియంత్రించుటకు ప్రత్యేకంగా పోక్సో చట్టం ఉందన్నారు. మైనరు బాలికలపై ఎవరైనా లైంగిక దాడులకు పాల్పడితే వారిపై పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. సైబరు మోసాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఎపికె ఫైల్స్, లింకులను ఓపెన్ చెయ్యొద్దన్నారు. అవగాహన రాహిత్యం వలన ప్రజలు సైబరు మోసాలకు గురవుతున్నారన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడే కేసుల్లో నేరగాళ్ళు సిబిఐ, ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టరు, దర్యాప్తు సంస్థ, న్యాయ మూర్తుల వేషధారణలో వాట్సాప్ కాల్స్తో అమాయకులను భయ పెట్టి, వారి నుండి డబ్బులను దోచేస్తున్నారన్నారు. ఈ తరహా కాల్స్ వస్తే ప్రజలెవ్వరూ స్పందించవద్దని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబరు మోసాలకు గురించి 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సాంకేతికత విజ్ఞానాన్ని పెంపొం దించు కొంటూ, ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, క్రమశిక్షణ, అంకిత భావంతో ఉన్నత మైన లక్ష్యాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, మీ గ్రామానికి మంచి పేరును తీసుకొని రావాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దా మోదర్ ఆకాంక్షించారు. యువజనోత్సవాల్లో భాగంగా సమాజా భివృద్ధికి కృషి చేస్తున్న పట్టణంలోని పలు ఎన్.జి.ఓ. ప్రతినిధు లకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో డిటిసి డి.మణికుమార్, ఎటికే స్పిరిచువల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం.డి. కరీముల్లా షరీఫ్, ప్రముఖ సామాజిక సేవా కార్యకర్తలు వెన్నెల చంద్ర శేఖర్, బి.రాజశేఖర్, ప్రముఖ రచయిత, సాహితీవేత్త ఇ .సురేష్, మై భారత్ డివైసి ఎం ప్రేమ్ భరత్ కుమార్, వన్ టౌన్సీఐఆర్.వి.ఆర్.కే.చౌదరి,ట్రాఫిక్సిఐ ఎస్.సూరి నాయుడు, వివిధస్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

# అయ్యప్ప మకరజ్యోతి దర్శన గోడపత్రిక ఆవిష్కరణ



ప్రజాస్వామ్యం భీమునిపట్నం, శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమిలి శ్రీ అయ్యప్ప ఆలయంలో ఈ నెల పద్నాలుగవ తేదీన జరగనున్న శ్రీ అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ అయ్యప్పస్వామి ట్రస్ట్ అధ్యక్షుడు సుసరాపు మాధవశాస్త్రి (మధు పంతులు) మాట్లాడుతూ ఈ నెల పద్నాలుగవ తేదీ బుధవారం భీమిలి శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు భీమిలి పాత బస్టాండ్ దరి బొండా బదరి నారాయణమూర్తి ఇంటి వద్ద నుండి స్వామి ఆభరణాలతో ఊరేగింపు మొదలవుతుందని చెప్పారు. సన్నాయి మేళం, కోలాటం, తప్పిట గుళ్లు, బళ్ల వేషాలు, కేరళ సంప్రదాయ వాయిద్యాలతో భీమిలి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి, సాయంత్రం 6.38 నిమిషాలకు సాగరతీరంలో శ్రీ అయ్యప్పస్వామి ఆలయం వద్ద మకరజ్యోతి దర్శన కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం భీమిలి ప్రాంతానికి చెందిన గురుస్వాములకు గురు పురస్కారాల పేరిట సత్కార కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనాన్ని చేసుకుని, స్వామి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు. అదే విధంగా శిథిలావస్థకు చేరిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, భక్తులు ఆర్థికంగా గానీ, వస్తు రూపంలో గానీ సహాయ సహకారాలు అందజేయడం ద్వారా స్వామి అనుగ్రహం పొందగలరని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ అయ్యప్పస్వామి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముసునూరి సూర్య శ్రీనివాస్, కోశాధికారి మొకర నర్సింగరావు, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, ప్రత్యేక ఆహ్వానితులు కొమ్మినేని ఎర్రినాయుడు, సభ్యులు బొండా నాగ వెంకట మణికంఠ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, టీడీపీ మూడవ వార్డు అధ్యక్షుడు గొలగాని నరేంద్ర, ముమ్మిడిశెట్టి ఆదిత్య, రాజేటి బసవ కృష్ణ మూర్తి, గాడు ఆనంద్, కొండ్రు గోవింద్ పాల్గొన్నారు.

# సన్ స్కూల్ లో కన్నుల పండుగగా సంక్రాంతి సంబరాలు



ప్రజాస్వామ్యం భీమునిపట్నం స్థానిక సన్ స్కూల్ లో శనివారం సంక్రాంతి సంబరాలను సన్ స్కూల్ విద్యాసంస్థల ప్రెసిడెంట్ లక్ష్మీ లావణ్య జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో భోగిమంటలు, అష్టలక్ష్మిలు, బల్లవేషా లు,సోదమ్మ,హరిదాసు,కొమ్మదాసు జంగ మయ్య, తప్పెటగుళ్ళు,కోలాటం,కోయ డాన్స్,బొమ్మల కొలువు, శకుంతల, విష్ణుమూర్తి,లక్ష్మీదేవి, గోదాదేవి, గంగిరెద్దులు మరియు వివిధ వేషధారణలతో విద్యార్థులు ఎంతగానో అలరించారు ప్రత్యేకంగా పులి వేషాలు, కథాకళి,మరియు కర్ర సాము చేసిన విద్యార్థినీ విద్యార్థులు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఇవే కాకుండా వివిధ రకాలతో ఏర్పాటుచేసిన తినుబండారాలు మరియు బొమ్మలు అమ్మే దుకాణాలతో పూర్తిగా పండుగ వాతావరణం కనిపించింది ఈ సందర్భంగా సన్ స్కూల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు భావితరాలకు వారిదిగా నిలిచి,మన సంస్కృతి సౌరభాలను అందజేయాలనే ఉద్దేశంతో, సంక్రాంతి సర్వ మానవాళికి శ్రేయస్సులు కలిగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులే కాకుండా పరిసర ప్రాంత ప్రజలు కూడా వీక్షించి ఆనందించారు.

# భాధిత కుటుంబానికి సిఎం సహాయ నిధి చెక్కు అందజేత



ప్రజాస్వామ్యం భీమునిపట్నం, భాధిత కుటుంబానికి సి ఎం సహాయ నిధి చెక్కును విశాఖ ఎంపి శ్రీభరత్ అందచేశారు. జీవిఎంసీ రెండోవార్డు సంగివలస గ్రామానికి చెందిన ఊళ్ళ బాలకృష్ణ జీర్ణాశయ సమస్యతో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద మంజూరైన రూ. 5,01,491(ఐదు లక్షల ఒక వెయ్యి నాలుగు వందల తొంభై ఒక్క రూపాయి )

ల చెక్కును గీతం అధినేత, విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బాధితుడు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్ లకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)
ఆదివారం, జనవరి 11 ,2026

## శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో కళాసాహితి సర్వసభ్య సమావేశం



ప్రజాస్వామ్యం భీమునిపట్నం భీమిలి కళాసాహితి సర్వసభ్య సమావేశం శనివారం శ్రీనివాస ఫంక్షన్ హాలు లో పి.రాజే0ద్ర ప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా రానున్న కాలము లో కళాసాహితి తరుపున షార్ట్ ఫిల్మ్ లు నిర్మి0చడం సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు.న్యాయవాది ఎన్. ఎల్.రావు.చెన్నయ్య శెట్టి.గంటా నూకరాజు. టి. భీమారావు రేలంగి పేద బాబు.వివిధ విషయాలు చెప్పారు కార్యదర్శి ఎల్.ఆది నారాయణ నివేదిక ఆర్థిక నివేదికలను అందించారు.అనంతరం జరిగిన సమావేశం కళాసాహితి లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేశారు. మైల పల్లి లక్ష్మణ రావు అద్వర్యం లో నూతన సభ్యుల ఎన్నిక జరిగింది.కోశాధికారిగా ఎచ్చెర్ల హరి..ఉపాధ్యక్షులు గా టి.భీమారావు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పిన్నింటి ఎర్రయ్య రెడ్డి కార్యదర్సులు గా పుసులూరి సూరిబాబు. బేతా జోగరావు.వై.ఎస్.వి.వి జగన్నాథ్ స్వామి ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఎన్. ఎల్ రావు. చెన్నాయశెట్టి లను ఎన్నుకున్నారు.ఈ సమావేశం లో వాడు మురళి.కె.ముత్యాలరావు..తదితరులు పాల్గొన్నారు

## పద్మశాలీయుల ఆడపడుచు పద్మావతి అమ్మవారు క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాస్వామ్యం తగరపువలస, స్థానిక పద్మశాలి సంఘం కార్యాలయం లో పద్మశలీయుల ఆడపడుచు పద్మావతి అమ్మవారు క్యాలెండర్ ను సంఘ గౌరవ అధ్యక్షుడు మాదాబతుల గురునాథ్, అధ్యక్షుడు కొప్పల రమేష్ ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి కోసూరు శ్రీను మురళీ, వైస్ ప్రెసిడెంట్ మాదాబతుల అప్పల రాజు, కోసూరు రాంబాబు, జాయింట్ సెక్రటరీ మాదాబతుల త్రినాథ్, క్యాషియర్ చింతలబుషి క్యాలెండర్ ప్రింటింగ్ దాతలు కొప్పల రమేష్, కొప్పల కృష్ణ, రాధిక షాపింగ్ మాల్ కొప్పల అప్పారావు, కోసూరు శ్రీను మురళీ, కోసూరు వెంకటేష్, మూర్తి, పెండిమి కిషోర్, స్టైలో వానపల్లి కిషోర్, జి ఆర్ ఉమ, మొండి కృష్ణ లు క్యాలెండరు ప్రింటింగ్ కు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమం లో జోగ అప్పారావు, తేడ్లపు చంటి, శ్రీరాములు, గిడుతూరీ పూర్ణ, కొప్పల శివ, మీసాల బుచ్చిబాబు, ఏలూరు శంకర్, మాదాబతుల అప్పారావు, మీసాల పేరయ్య, సూరిశెట్టి సూర్య, మామిడి రమేష్, సప్పా నర్సింహులు, మాదాబత్తుల శేఖర్, మోటారు సత్యనారాయణ, జీన్స్ రామారావు, ఆలేటి ఆదినారాయణ, తేడ్లపు శివశంకర్, చిలుకోటి హేమసుందర్, మైక్ రమణ పాల్గొన్నారు.

## స్మృతి కాబోయేవాడితో ఉన్న ఈ అమ్మాయ్ ఎవరు.! పలాష్ ఇంత పెద్ద చీటరా.? వైరల్ ఫోటోలు



భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఇప్పుడు కొత్త ట్విస్ట్ బయటపడింది. భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు స్మృతి మంధాన. పెళ్లి కొడుకు తరపున వారు చెప్పినా ఆమె తండ్రి ఆరోగ్యమే ముఖ్యమని చెప్పడంతో.. పెళ్లి ఆగిపోయింది. అయితే అదేరోజు రాత్రి పలాశ్ ముచ్చల్ కూడా అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైరల్ ఇన్ఫెక్షన్, అసిడిటీ వల్ల అతడు ఇబ్బంది పడ్డాడని వైద్యులు వెల్లడించారు. చికిత్స అనంతరం పలాశ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అయితే ఈ విషయానికి సంబంధించి పలాశ్ సోదరి పలాక్ ముచ్చల్ ఇన్‌స్టా వేదికగా స్టోరీ షేర్ చేశారు. 'స్మృతి మంధాన నాన్నగారికి అనారోగ్యం కారణంగా, మంధాన, పలాశ్ వివాహం ప్రస్తుతానికి ఆగిపోయింది. ఈ సమయంలో అందరూ ఇరు కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని కోరుతున్నానంటూ పోస్ట్ చేశారు.

## ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?




ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కానీ విదేశీ టోర్నీలలో మాత్రం తన సత్తా చాటాడు. ఇది అటుంచితే కెప్టెన్ గా మాత్రం విఫలమయ్యాడు. ఆడిన 4 మ్యాచ్ లలోనూ ఓటమిపాలై.. పేలవ ప్రదర్శన కనబరిచింది. మరి ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా. ఓ సారి లుక్కేయండి.ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?

# డీకేపర్తి గ్రామంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

### ఇంటింటి కొళాయిలు ప్రారంభం





ప్రజాస్వామ్యం/విజయనగరం/ గంట్యాడ:రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎన్ ఆర్ ఐ సాధికార శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం గంట్యాడ మండలం డీకేపర్తి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా రూ. 11 లక్షల 20 వేల వ్యయంతో చేపట్టిన త్రాగునీటి పథకం, ఇంటింటి కొళాయిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న మంత్రివర్యులు, ప్రజల సంక్షేమం శగా పలు కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా మంత్రిగారి సొంత నిధులతో 600 దుప్పట్లు, సౌత్ ఏషియా ఎల్పీజీ సంస్థ సిఎస్ఆర్ నిధులతో 800 సోలార్ లాంతరులను పంపిణీ చేశారు. అదేవిధంగా డిఆర్డిఏ వెలుగు గ్రామ సంఘం ద్వారా 46 మం స్వయం సహాయక మహిళలకు రూ. 23 లక్షల విలువైన వడ్డీ లేని ఉన్నతి రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. పర్యటన లో భాగంగా డి కే పర్తి డ్జ్ ని పరిశీలించిన మంత్రి బ్రిడ్జ్ కు అనుసంధానమైన రహదారిని వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. -- కోటారుబిల్లి లో ?అంగన్‌వాడీలకు 5.జి ఫోన్ల పంపిణీఅంగన్‌వాడీ వ్యవస్థను డిజిటలైజ్ చేసే శగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రలు, ఎన్ ఆర్ ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గర్భిణీ స్త్రీలు, శిశువుల ఆరోగ్యం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. తన దృష్టిలో ఐసీడీఎస్ అత్యంత కీలకమైన శాఖ అని, క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీల పనితీరు సమాజంపై నేరుగా ప్రభావం చూపు తుందని ఆయన వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 5.జి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. 5.జి ఫోన్ల ద్వారా అంగన్ వాడీ కేంద్రాల పనితీరులో పారదర్శకత పెరుగు తుందని, రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అంచడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని కొనియాడారు. అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, ఆధునిక సాంకేతికతను వారికి అందుబాటులోకి తీసుకు రావడం అందులో భాగమేనని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాలలో డి.ఆర్.డి.ఎ పి.డి శ్రీనివాస్ పాణి, ఐసిడిఎస్ పి.డి విమాలారాణి, ఎం.పి.డి.ఒ, తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# పెళ్లిని వాయిదా వేసింది స్మృతి మంధాన కాదంట.. ఎవరో తెలుసా?




టీం ఇండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వివాహం తన తండ్రి అనారోగ్యం కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. వివాహం రద్దు అయిన తర్వాత, కాబోయే భర్త పలాష్ ముచ్చల్ తల్లి ఒక కీలక విషయాన్ని వెల్లడించింది. స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీతకారుడు పలాష్ ముచ్చల్ వివాహం వాయిదా పడినప్పటి నుంచి కొత్త విషయాలు వెల్లడవుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదట్లో, స్మృతి మంధాన తండ్రి ఆరోగ్యం పెళ్లి రోజున క్షీణించిందని, ఆయనకు గుండెపోటు వచ్చిందని, ఆ తర్వాత ఆయన ఆసుపత్రిలో చేరారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత, తన తండ్రి ఆరోగ్యం కారణంగా స్మృతి మంధాన వివాహాన్ని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. ఇప్పుడు, ఈ కథలో కొత్త మలుపు వచ్చింది. సంగీతకారుడు పలాష్ ముచ్చల్ తల్లి వివాహాన్ని వాయిదా వేసింది స్మృతి కాదని, తన కొడుకు అని వెల్లడించి షాకిచ్చింది. దీని వెనుక ఉన్న ప్రధాన కారణాన్ని ఆమె వివరించింది. పలాష్ తల్లి కూడా పలాష్ స్మృతి కంటే క్రికెటర్ తండ్రికి దగ్గరగా ఉండేవాడని పేర్కొంది.పెళ్లి వాయిదా వేసింది పలాష్, స్మృతి కాదు..ఒక ఇంటర్వ్యూలో, పలాష్ తల్లి అమిత ముచ్చల్, తన కొడుకు, స్మృతి తండ్రి చాలా సన్నిహితంగా ఉండేవారని వివరించింది. అందువల్ల, స్మృతి తండ్రిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లిన వెంటనే, పలాష్ వివాహ ఆచారాలు, ఇతర ఆచారాలను ఆపాలని నిర్ణయించుకున్నాడని తెలిపింది.ఇవి కూడా చదవండిపలాష్ తల్లి మాట్లాడుతూ, "పలాష్ మామ (స్మృతి తండ్రి) తో చాలా అనుబంధం కలిగి ఉన్నాడు. స్మృతి కంటే చాలా క్లోజ్ గా ఉండేవాడు. అతని ఆరోగ్యం క్షీణించినప్పుడు, మామ కోలుకునే వరకు పెళ్లిని వాయిదా వేయాలని పలాష్ స్మృతి కంటే ముందే నిర్ణయించుకున్నాడు" అంటూ తెలిపింది.పలాష్ సోదరి ఏమి చెప్పిందంటే? స్మృతి మంధానతో తన సోదరుడి వివాహం వాయిదా పడిన తర్వాత, ప్రముఖ గాయని పాలక్ ముచ్చల్ తన మౌనాన్ని వీడి ఇన్‌స్టాగ్రామ్‌లో పూర్తి నిజాన్ని పంచుకుంది. స్మృతి తండ్రి అనారోగ్యం కారణంగా, స్మృతి, పలాష్ వివాహం వాయిదా పడినట్లు చెప్పుకొచ్చింది. ఈ సున్నితమైన సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాల గోప్యతను గౌరవించాలని మేము అభ్యర్థిస్తున్నాం అంటూ రాసుకొచ్చింది.¯ ఎళ్లిని వాయిదా వేసింది స్మృతి మంధాన కాదంట.. ఎవరో తెలుసా? స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీతకారుడు పలాష్ ముచ్చల్ వివాహం వాయిదా పడినప్పటి నుంచి కొత్త విషయాలు వెల్లడవుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదట్లో, స్మృతి మంధాన తండ్రి ఆరోగ్యం పెళ్లి రోజున క్షీణించిందని, ఆయనకు గుండెపోటు వచ్చిందని, ఆ తర్వాత ఆయన ఆసుపత్రిలో చేరారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత, తన తండ్రి ఆరోగ్యం కారణంగా స్మృతి మంధాన వివాహాన్ని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది.ఇప్పుడు, ఈ కథలో కొత్త మలుపు వచ్చింది. సంగీతకారుడు పలాష్ ముచ్చల్ తల్లి వివాహాన్ని వాయిదా వేసింది స్మృతి కాదని, తన కొడుకు అని వెల్లడించి షాకిచ్చింది. దీని వెనుక ఉన్న ప్రధాన కారణాన్ని ఆమె వివరించింది. పలాష్ తల్లి కూడా పలాష్ స్మృతి కంటే క్రికెటర్ తండ్రికి దగ్గరగా ఉండేవాడని పేర్కొంది.పెళ్లి వాయిదా వేసింది పలాష్, స్మృతి కాదు..ఒక ఇంటర్వ్యూలో, పలాష్ తల్లి అమిత ముచ్చల్, తన కొడుకు, స్మృతి తండ్రి చాలా సన్నిహితంగా ఉండేవారని వివరించింది. అందువల్ల, స్మృతి తండ్రిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లిన వెంటనే, పలాష్ వివాహ ఆచారాలు, ఇతర ఆచారాలను ఆపాలని నిర్ణయించుకున్నాడని తెలిపింది.ఏకంగా 89 మంది ప్లేయర్లకు ఇచ్చిపడేసిన వైభవ్ సూర్యవంశీ.. అదేంటంటే.?పలాష్ తల్లి మాట్లాడుతూ, "పలాష్ మామ (స్మృతి తండ్రి) తో చాలా అనుబంధం కలిగి ఉన్నాడు. స్మృతి కంటే చాలా క్లోజ్ గా ఉండేవాడు. అతని ఆరోగ్యం క్షీణించినప్పుడు, మామ కోలుకునే వరకు పెళ్లిని వాయిదా వేయాలని పలాష్ స్మృతి కంటే ముందే నిర్ణయించుకున్నాడు" అంటూ తెలిపింది.పలాష్ సోదరి ఏమి చెప్పిందంటే?స్మృతి మంధానతో తన సోదరుడి వివాహం వాయిదా పడిన తర్వాత, ప్రముఖ గాయని పాలక్ ముచ్చల్ తన మౌనాన్ని వీడి ఇన్‌స్టాగ్రామ్‌లో పూర్తి నిజాన్ని పంచుకుంది. స్మృతి తండ్రి అనారోగ్యం కారణంగా, స్మృతి, పలాష్ వివాహం వాయిదా పడినట్లు చెప్పుకొచ్చింది. ఈ సున్నితమైన సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాల గోప్యతను గౌరవించాలని మేము అభ్యర్థిస్తున్నాం అంటూ రాసుకొచ్చింది.

# ధోని అడ్డాలో రోహిత్, కోహ్లీ విధ్వంసం మామూలుగా లేదుగా.. అసలు మ్యాటర్ తెలిస్తే షాకే



భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ రాంచీలోని అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత భారతదేశంలో వన్డే మ్యాచ్ ఆడనున్నారు. ధోని అడ్డాలో రోహిత్, కోహ్లీ విధ్వంసం మామూలుగా లేదుగా.. అసలు మ్యాటర్ తెలిస్తే షాకే మహేంద్ర సింగ్ ధోని స్వస్థలం రాంచీలో మరోసారి క్రికెట్ ఉత్సాహం కనిపించనుంది. దాదాపు మూడు సంవత్సరాల తర్వాత, నవంబర్ 30 న %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో భారత్ %-% దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ జరగనుంది. ఉత్సాహం ఎంతగా ఉందంటే, చలికాలపు రాత్రి కూడా, వేలాది మంది క్రికెట్ అభిమానులు అర్ధరాత్రి నుంచే స్టేడియం వెలుపల వరుసలో క్యూ కట్టారు. జాకెట్లు , మఫ్లర్లు, టోపీలు, దుప్పట్లు ధరించి ఉదయం 9 గంటలకు కౌంటర్లు తెరిచిన వెంటనే తమ అభిమాన భారత స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను ప్రత్యక్ష ప్రసారంలో చూసే అవకాశం లభిస్తుందని ఆశించి టిక్కెట్లు కొనుగోలు చేశారు.రాత్రి 12 గంటల నుంచే టిక్కెట్ల కోసం క్యూ.. స్టేడియంలో జరిగే ఈ అంతర్జాతీయ మ్యాచ్ కోసం, %జీూజాూ% స్టేడియం వెలుపల ఉన్న 6 టికెట్ కౌంటర్ల నుంచి ఈరోజు, అంటే నవంబర్ 25న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆఫ్‌లైన్ టిక్కెట్లను విక్రయించారు. అయితే, క్రికెట్ పట్ల ఉన్న క్రేజ్ ఎంతగా ఉందంటే, అభిమానులు అర్ధరాత్రి 12:00 గంటల నుంచే స్టేడియం వెలుపల ఉన్న టికెట్ కౌంటర్ లైన్‌ను ముందు క్యూ నిలిచారు. ఈ మ్యాచ్ టిక్కెట్ ధరలు రూ .1200 నుంచి రూ .12,000 వరకు ఉన్నాయి. వివిధ విభాగాల దిగువ, ఎగువ శ్రేణికి వేర్వేరు ధరలు నిర్ణయించారు. ఇంకా, ఆతిథ్యాన్ని బట్టి టికెట్ ధరలు మారుతూ ఉంటాయి. ఆఫ్‌లైన్ టికెటింగ్ కోసం ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. రెండు కౌంటర్లలో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి రసీదులు చూపించిన తర్వాత ఆఫ్‌లైన్ టిక్కెట్లు జారీ చేయనున్నారు. ఒక కౌంటర్ మహిళలకు రిజర్వు చేశారు. ప్రతి వ్యక్తికి గరిష్టంగా రెండు టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలి. ఇంకా, టిక్‌టాక్ బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి, అభిమానులు టికెట్ కౌంటర్లలో టిక్కెట్లను క్రమబద్ధంగా అందుకునేలా చూసు కోవడానికి పెద్ద సంఖ్యలో భద్రతా దళాలను మోహరించారు. ఇవి కూడా చదవండిఏకంగా 89 మంది ప్లేయర్లకు ఇచ్చిపడేసిన వైభవ్ సూర్యవంశీ.. అదేంటంటే.? మొదటి బ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్ళు రాంచీకి.. ఈరోజు ఐదుగురు భారత ఆటగాళ్ళు రాంచీకి చేరుకుంటారు. ఇందులో రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. భారత జట్టులోని మిగిలిన సభ్యులు, దక్షిణాఫ్రికా జట్టు నవంబర్ 27న గౌహతి నుంచి రాంచీకి చేరుకుంటారు. ఆటగాళ్ళు రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయం నుంచి బయలుదేరి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. అక్కడ వారు నవంబర్ 28, 29 తేదీలలో %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో బస చేసి ప్రాక్టీస్ చేస్తారు.భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ రాంచీలోని అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత భారతదేశంలో వన్డే మ్యాచ్ ఆడనున్నారు. ధోని అడ్డాలో రోహిత్, కోహ్లీ విధ్వంసం మామూలుగా లేదుగా.. అసలు మ్యాటర్ తెలిస్తే షాకే మహేంద్ర సింగ్ ధోని స్వస్థలం రాంచీలో మరోసారి క్రికెట్ ఉత్సాహం కనిపించనుంది. దాదాపు మూడు సంవత్సరాల తర్వాత, నవంబర్ 30 న %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో భారత్ %-% దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ జరగనుంది. ఉత్సాహం ఎంతగా ఉందంటే, చలికాలపు రాత్రి కూడా, వేలాది మంది క్రికెట్ అభిమానులు అర్ధరాత్రి నుంచే స్టేడియం వెలుపల వరుసలో క్యూ కట్టారు. జాకెట్లు , మఫ్లర్లు, టోపీలు, దుప్పట్లు ధరించి ఉదయం 9 గంటలకు కౌంటర్లు తెరిచిన వెంటనే తమ అభిమాన భారత స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను ప్రత్యక్ష ప్రసారంలో చూసే అవకాశం లభిస్తుందని ఆశించి టిక్కెట్లు కొనుగోలు చేశారు.రాత్రి 12 గంటల నుంచే టిక్కెట్ల కోసం క్యూ.. స్టేడియంలో జరిగే ఈ అంతర్జాతీయ మ్యాచ్ కోసం, స్టేడియం వెలుపల ఉన్న 6 టికెట్ కౌంటర్ల నుంచి ఈరోజు, అంటే నవంబర్ 25న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆఫ్‌లైన్ టిక్కెట్లను విక్రయించారు. అయితే, క్రికెట్ పట్ల ఉన్న క్రేజ్ ఎంతగా ఉందంటే, అభిమానులు అర్ధరాత్రి 12:00 గంటల నుంచే స్టేడియం వెలుపల ఉన్న టికెట్ కౌంటర్ లైన్‌ను ముందు క్యూ నిలిచారు. ఈ మ్యాచ్ టిక్కెట్ ధరలు రూ .1200 నుంచి రూ .12,000 వరకు ఉన్నాయి. వివిధ విభాగాల దిగువ, ఎగువ శ్రేణికి వేర్వేరు ధరలు నిర్ణయించారు. ఇంకా, ఆతిథ్యాన్ని బట్టి టికెట్ ధరలు మారుతూ ఉంటాయి. ఆఫ్‌లైన్ టికెటింగ్ కోసం ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. రెండు కౌంటర్లలో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి రసీదులు చూపించిన తర్వాత ఆఫ్‌లైన్ టిక్కెట్లు జారీ చేయనున్నారు. ఒక కౌంటర్ మహిళలకు రిజర్వు చేశారు. ప్రతి వ్యక్తికి గరిష్టంగా రెండు టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలి. ఇంకా, టిక్‌టాక్ బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి, అభిమానులు టికెట్ కౌంటర్లలో టిక్కెట్లను క్రమబద్ధంగా అందుకునేలా చూసుకోవడానికి పెద్ద సంఖ్యలో భద్రతా దళాలను మోహరిం చారు. ఇవి కూడా చదవండిఏకంగా 89 మంది ప్లేయర్లకు ఇచ్చిపడేసిన వైభవ్ సూర్యవంశీ.. అదేంటంటే.? మొదటి బ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్ళు రాంచీకి.. ఈరోజు ఐదుగురు భారత ఆటగాళ్ళు రాంచీకి చేరుకుంటారు. ఇందులో రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. భారత జట్టులోని మిగిలిన సభ్యులు, దక్షిణాఫ్రికా జట్టు నవంబర్ 27న గౌహతి నుంచి రాంచీకి చేరుకుంటారు. ఆటగాళ్ళు రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయం నుంచి బయలుదేరి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. అక్కడ వారు నవంబర్ 28, 29 తేదీలలో %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో బస చేసి ప్రాక్టీస్ చేస్తారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022